# దోపిడీ

అర్ధరాత్రి!

ఊరు మాటుమణిగింది, సుబ్బారావు ఇల్లు తప్ప.

సుబ్బారావుకు నిద్రపోకవడం సరదాకాదు. సెలవు దొరికితే గుర్రుపెట్టి నిద్రపోయే వాళ్ళల్లో అతనూ ఒకడే.!

అతని సమస్య - భార్యను ఆస్పత్రికి తీసుకుపోవాలా వద్దా - అని ఆమె వైపు ఆందోళనగా చూశాడు.

"ఎలా ఉంది?" ఫర్వాలేదు అంటుందేమోనని అతని ఆశ.

"తెలియడంలేదు." ఆయాసపడుతూ చెప్పింది రాధ బాధతో.

"మందు వేసుకున్నావుగా, పని చేస్తుందిలే పడుకో." అని తను వరండాలో తిరగసాగాడు.

కాసేపటికి రాధనుంచి పిలుపు వచ్చింది. "లాభం లేదు. డాక్టరును పిలవండి ఎస్ ఓ ఎస్."

"నీ దుంపతెగ! ఇంత అర్ధరాత్రి ఏ డాక్టరు వస్తాడే ? కాస్త ఓర్చుకోరాదూ? తెల్లారింతర్వాత పోదాం." ఆపుకున్నా ఆగలేదు అతనికి విసుగు.

"సరే? నే బతికుంటే.... అలానేతీసుకుపోదురుగాని." వగరుస్తూ అంది రాధ.

ఇక సుబ్బారావుకు కాళ్ళు చేతులూ ఆడలేదు. తలుపేసి రోడ్డుమీదకు వచ్చాడు. వీధి నిర్మానుష్యంగా ఉంది. పెద్ద పెద్దపెద్ద అంగలేసుకుంటూ రెండు ఫర్లాంగులు నడిచిసెంటరుకు వచ్చాడు.

ఓ రిక్షా నిద్రపోతూ కనిపించింది. "ఏయ్ లే ఆస్పత్రికి పోవాలి .ఏం తీసుకుంటావ్?" ఆదుర్దాగా అడిగాడు.

సుబ్బారావు ఆదుర్దాను కనిపెట్టిన రిక్షాకు మత్తు దిగింది. గట్టిబేరం తగిలిందని గ్రహించింది.

"ఎల్లు ఎల్లవయ్యా? బంగారం లాంటి నిద్రపాడుచేశావు." ఆవులించి పడుకున్నాడు రిక్షా అబ్బి.

"బాబ్బాబు? నాభార్యకుసీరియస్‌గా ఉంది. డేంజర్! మళ్ళీ నిద్రపోదుగాని - మమ్మల్ని ఆస్పత్రికి చేర్చు..." అన్నాడు-రాధ బాధ తల్చుకుని మెలికలు తిరుగుతూ.

ఇక బతిమాలించుకోవడం ఇష్టంలేక నోటికొచ్చిన రేటు చెప్పాడు రిక్షావాలా.

"పది రూపాయలవుద్ది."

"ఆ(! ఎంతదూరం? రెండు రూపాయలేగదా?"

"బేరం చేస్తే రేటు పెరుగుద్ది ఏదో ఆడబిడ్డ ఆపదలో ఉందంటే వస్తున్నా?" నిర్లక్ష్యంగా అన్నాడు.

సుబ్బారావు మరేమి ఆలోచించకుండా తన దుస్థితిని తిట్టుకుంటూ రిక్షా ఎక్కి ఇంటికెళ్ళి తన అర్ధాంగిని తీసుకొని ధర్మాసుపత్రికి వెళ్ళాడు.

ఎమర్జెన్సీ వార్డు జోగుతున్నది.

"సిస్టర్ ! సిస్టర్!" పిలిచాడు.

"ఉష్ నాకేమన్నా చెవుడా? అంత పెద్దగా అరుస్తావ్?" సిస్టర్ మగత కళ్ళు తెరిచి కసురుకుంది.

"నా భార్యకుసీరియస్‌గా ఉంది."

"సో వాట్?" అన్నట్లు అతని వంక చూసి - ఆమెను పురుగును చూసినట్లు చూసింది.

"సిస్టర్‌పదిరూపాయలు కిందపడి ఉంది - మీదే కదూ?" సుబ్బారావు తన జేబులోంచి కింద పడేసిన నోటు తీసి ఆమె చేతిలో పెట్టాడు.

"వాట్? ఇందాకటి నుంచి ఎంత వెదికినా కనపళ్ళేదు." ఆమెలో చలనం వచ్చింది. మగత వదిలి

పోయింది.

రాధను పరీక్షించి - ఓ ఇంజెక్షన్ చేసింది.

"డ్యూటీ డాక్టరుగారు...?" నీళ్ళు నమిలాడు.

"ఆయన నొచ్చినా ఇచ్చే మందులు ఇవే? ఇవి పట్టుకురండి. ఏం భయంలేదు."

సిస్టర్ అభయహస్తమిచ్చి కొన్ని మందులు రాసి ఇచ్చింది.

సుబ్బారావు దురదృష్టం అతన్నింకా వెంటాడుతూనే ఉంది. ఊరుఊరంతా తిరిగినా ఒక్కషాపూ తెరచిలేదు. మందులు షాపులు మందుకొట్టి మొద్దు నిద్ర పోతున్నాయి.

షాపుదగ్గరే ఇల్లున్న పొప్రయిటర్ గుర్తుకు వచ్చాడు అతనికి. పోయి ప్రొప్రైటర్ని నిద్రలేపాడు. ఊహుఁ కాదు. నిద్ర లేవడానికి ప్రయత్నించాడు.

అతనికా క్షణంలో రావణాసురుడిపైన బోల్డు జాలి కలిగింది. వీణ్ణి లేపడానికి తానింత తిప్పలు పడుతున్నాడు. పాపం! కుంభకర్ణుణ్ణి లేపడానికి రావణాసురుడు ఎన్ని పాట్లు పడ్డాడో?

"వెదవ సంత! కంటినిండా నిద్రపోనీయరు..." సుబ్బారావు చెవులు అతని సణుగుడు - గొణుగుడు వింటూనే ఉన్నాయి. అవసరం తనది. కానిచోట...కావలిసిన చోట, దులపరించుకుపోవడం అతని అలవాటు.

"ఎవరయ్యా ఈ మందులు రాసిందీ. ఇవి బాన్ అయి ఆర్నెల్లయింది!" షాపువాడు చీవాట్లు పెట్టాడు.

సుబ్బారావు గుండెలో రాయిపడింది. "సరే? వాటి బదులుగా వేరే మందులిస్తాను.. అదే కాంబినేషన్ పట్టుకెళ్ళు." జాలిగా అన్నాడు. అవి వేరే కంపెనీవమందులు చాలాకాలంగా అమ్ముడుపోకుండా నిలబడిపోయినవి తీసిచ్చాడు.

"బిల్?"

"ఫిఫ్టీ! యాభై రూపాయలు."

సుబ్బారావుకు కళ్ళు తిరిగాయి. అయినా రాధను బతికించుకోవాలంటే యాభైగురించి ఆలోచించకూడదు.

మందులు తీసుకుని ఆసుపత్రికి వచ్చేసరికి డాక్టరు బాబు హాజరై ఉన్నాడు. సిస్టర్ అతనికి ఏదో చెబుతున్నది. సుబ్బారావు కళ్ళు ఆత్రంగా రాధకోసం వెతికాయి.

"మందులు తెచ్చారా?" సిస్టర్ అడిగింది. చూపించాడు మౌనంగామ్లానంగా.

"నే రాసిచ్చిందేవిటీ? మీరు తెచ్చిందేమిటీ?"

"మరి. అవి గవర్నమెంట్ బ్యాన్ చేసిందని, వాటి సబ్‌స్టిట్యూట్స్‌ను ఇచ్చాడు."

"ఎవడా చెప్పిన ఇడియట్!" డాక్టర్ కరుగ్గా అన్నాడు. అతన్ని చూస్తు చివరి పదానికి ఫోర్సును ఇచ్చి.

తననే అన్నట్లు ఫీలయ్యాడు సుబ్బారావు.

"సరే ఏదో ఒకటి? వాడు అమ్ముకోవడానికి ఈ ఏడుప్పు ఏడ్చి ఉంటాడు. సిస్టర్ ఆ ఇంజెక్షన్ లోడ్ చెయ్యి." ఆర్డరు జారీచేశారు యాక్టరులా.

అప్పుడు చూశాడు సుబ్బారావు రాధని. పక్కగదిబెడ్‌మీద ఎగశ్వాస పీలుస్తున్నది.

వెంటవెంటనే డాక్టరు రెండు ఇంజెక్షన్లు చేశాడు.

"నర్స్! ఆక్సిజన్ క్విక్! అరేంజ్ ఇమ్మీడియట్లీ!" డాక్టర్ చెప్పాడు.

"ఎలా ఉంది సార్ నా రాధకు?" ఏడుపు దిగమింగుకుంటూ అడిగాడు.

"నక్షత్రకుడిలా అడ్డురాకు. డోంట్ డిస్టర్బ్ యూ ఫూల్! క్విక్- ఆక్సిజన్ సిలిండర్ - క్విక్.." తొందరపెట్టాడు సిస్టర్‌ను.

నర్సు సిలిండరు తీసుకొచ్చి గొట్టాన్ని ఆమె ముక్కుకు అమర్చింది జాగ్రత్తగా.

"సర్ నో ఆక్సిజన్ సర్. ఇటీజ్ ఎంప్టీ?" సిస్టర్ ఖంగారు పడిపోయింది.

"వేరేది ట్రై చెయ్యి."

"సారీసర్. నో స్టాక్. దిసీజ్ ది లాస్ట్ వన్."

"వ్వాట్ నాన్సెన్స్!"

"యస్సార్. ఈ పవర్‌కట్ మూలంగా ఆక్సిజన్ సప్లై సగానికి సగం పైగా పడిపోయింది." సిస్టర్ చెప్పింది నింపాదిగా.

"వాట్ హెల్?" కోపంగా అరిచాడు డాక్టర్.

సుబ్బారావుకు భయం వేసింది. సీట్లో కూర్చునున్న డాక్టర్ దగ్గరికి వచ్చాడు. జేబులోంచి నోటు తీసి ఆయనకిచ్చాడు.

"సార్! ఇదే నా దగ్గరున్న ఆఖరినోటు. దయచేసి నా భార్యను రక్షించండి." కన్నీళ్ళతో అతని కాళ్ళమీద పడిపోయాడు.

"నర్స్! ఇంకెక్కడన్నా ఆక్సిజన్ దొరుకుతుందేమో ప్రయత్నించు." బోల్డు సానుభూతి కురిపిస్తు అన్నాడు.

కొన్ని నిమిషాల తర్వాత నర్సు ఎక్కడినుంచో ఓ ఆక్సిజన్ సిలిండరు సంపాదించి తెచ్చింది.

కాని, దాని అవసరం లేకపోయింది.

కొన్ని గంటల తర్వాత ... ఆటోఛార్జీకి అదిరిపోయాడు.

ఇంకా కొన్ని గంటల తర్వాత... కాటికాపరి రేటుకు నీరుకారిపోయాడు.

కొన్ని రోజుల తర్వాత... శ్రాద్ధకర్మ బ్రాహ్మడి రేటుకు మూర్ఛపోయాడు.

ఇంకా కొన్ని రోజుల తర్వాత.. ఖాతా అంగడిలో జమ అయిన అప్పుకు జావకారిపోయాడు.

ఒక నెల తర్వాత....

కర్మకొచ్చిన చుట్టాలు వేసిన తిష్టకు, చేసిన తిండి దోపిడీకి తేరుకోలేనంతగా అప్పుల ఊబిలో కూరుకుపోయాడు సుబ్బారావు.

ఈ దోపిడీ..... ఆదిమధ్యాంత రహితం! ★

(ఆంధ్ర ప్రభ వార పత్రిక)

